ప్రజాశక్తి
గురువారం 28 నవంబర్ 2024
5
శ్రీ సత్యసాయి

మినీ జెసిబి ముందు బైటాయించి నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు

యంత్రాలతో పారిశుధ్య పనులకు యత్నం

అడ్డుకున్న సిఐటియు, పారిశుధ్య కార్మికులు

అధికారుల చర్యలపై సిపిఎం, సిఐటియు నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బ మేజర్ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ నియామక పత్రాలు, కనీస వేతనం, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఏడు రోజుల నుంచి సమ్మె కొనసాగుతోంది. పంచాయతీ పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. అధికారులు కార్మికుల సమస్యల పరిష్కారంపై స్పందించకుండా యంత్రాల ద్వారా పారిశుధ్య పనులను చేయించేందుకు బుధవారం ప్రయత్నించారు. పుట్టపర్తి నుంచి మినీ జెసిబిని తెప్పించి పారిశుధ్య పనులు మొదలు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు, సిపిఎం నాయకులు కార్మికులతో కలిసి అక్కడికెళ్లి మినీ జెసిబి ముందు బైటాయించారు. పనులు చేయనీయకుండా అడ్డుకున్నారు. కార్మికుల సమస్యలను తీర్చమంటే ఇలా యంత్రాలతో పనులు చేయించడం సరికాదని సిఐటియు నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు నియామక పత్రాలు, కనీస వేతనం, ఇతర సమస్యలను పరిష్కరిస్తే వెంటనే సమ్మె విరమించి విధుల్లోకి చేరుతారన్నారు. కార్మికుల సమస్యను ఈవీఆర్డీ దివాకర్, పంచాయతీ సెక్రటరీ మంజుల, డిఎల్‌పిఒ శివ కుమారికి తెలిపారు. సిఐటియు నాయకులు డిఎల్‌పిఒ మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చిన వెంటనే సమ్మెను విరమిస్తామని తెలియజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని డిఎల్‌పిఒ తెలియజేశారు. అంత వరకు సమ్మెను కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, పోతలయ్య, మధుసూదన్ రెడ్డి, వెంగముని, బాబ్జాన్, నౌషాద్, టైలర్ ముత్తు, రహీమ్, చికెన్ రఫీ, పంచాయతీ పారిశుధ్య, నీటి సరఫరా కార్మికులు పాల్గొన్నారు.

కూటమి 'టోల్' బాదుడు..!

కూటమి ప్రభుత్వం ప్రజలపై మరో బాదుడుకు సిద్ధం అయ్యింది. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలపై అదనపు వసూళ్లు చేస్తోంది. ఇప్పుడు రాష్ట్ర హైవేలపై టోల్‌గేట్ల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు జాతీయ రహదారులపైనే టోల్‌గేట్లు ఉండేవి. ఇక రాష్ట్ర హైవేలపైనా వీటి ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించింది. పిపిపి(పబ్లిక్- ప్రయివేటు పార్టనర్‌షిఫ్) పేరుతో రహదారుల నిర్మాణానికి సముఖతను వ్యక్తం చేసింది. ఇటీవలే అసెంబ్లీ వేదికగా ఈ అంశంపై ముఖ్యమంత్రి స్పష్టతనిచ్చారు. ఇది అమల్లోకి వస్తే వాహన దారులకు అదనపు టోల్ బాదుడు తప్పదు.

- ◆ రాష్ట్ర రహదారులపై టోల్ వసూలుకు రంగం సిద్ధం
- ◆ పిపిపి మోడల్‌లో రాష్ట్ర హైవేలు
- ◆ తొలిదశలో 'అనంత'లో రెండు రోడ్లు ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పిపిపి(పబ్లిక్- ప్రయివేటు పార్టునర్‌షిఫ్) పేరుతో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో 18 రహదారులను ఈ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి రెండు రహదారులున్నాయి. దామాజీపల్లి-నాయనపల్లి క్రాస్-పెద్దపప్పూరు మీదుగా తాడిపత్రి 99 కిలోమీటర్ల రహదారిని పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సత్యసాయి జిల్లాలో సోమందేపల్లి-హిందూపురం మీదుగా తూముకుంట వరకు మొత్తం 35.53 కిలోమీటర్లు పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రెండో దశలో రాష్ట్ర వ్యాప్తంగా 68 రహదారులను ఈ పద్ధతిలో అభివృద్ధి చేస్తారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లా రహదారులు ఎన్ని అన్నది తెలియాల్సి ఉంది.

జిల్లాలో మొత్తం 31 రాష్ట్ర హైవేలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 32 రాష్ట్ర హైవేలు ఉన్నాయి. మొత్తం 1197.11 కిలోమీటర్లు ఉంటాయి. వీటి వివరాలు ఈ విధంగానున్నాయి. హిందూపురం-కదిరి, జమ్మలమడుగు-కదిరి, రాజంపేట -కదిరి, గుంతకల్లు-ఉరవకొండ, గుంతకల్లు-తుంగభద్ర రోడ్డు, నెల్లూరు-బళ్లారి-ముంబాయి రోడ్డు, దామాజీపల్లి-నాయనపల్లి క్రాస్-పెద్దపప్పూరు, నాగసముద్రం-పేరూరు, గుత్తి-పత్తికొండ, ఆదోని, కోడూరు-ధర్మవరం రోడ్డు, హిందూపురం-సోమందేపల్లి, అనంతపురం-తగరకుంట, నసనకోట రోడ్డు, కొండాపురం-దంతపల్లి రోడ్డు, బాలసముద్రం- కొక్కంటి-పెడబల్లి రోడ్డు, ధర్మవరం- తగరకుంట కళ్యాణదుర్గం రోడ్డు, హిందూపురం- బెంగళూరు రోడ్డు, పెనుకొండ- ముదిగుబ్బ, దొరిగల్లు రోడ్డు, పెనుకొండ- మడకశిర రోడ్డు, కళ్యాణదుర్గం-మడకశిర రోడ్డు, బళ్లారి- గుండ్లపల్లి రోడ్డు, రాయదుర్గం-కణేకల్ రోడ్డు, మడకశిర- అమరాపురం రోడ్డు, పామిడి-వజ్రకరూరు రోడ్డు, ఉరవకొండ-కణేకల్ వయా సొల్లాపురం రోడ్డు, బత్రేపల్లి-తలుపుల- పెద్దన్నవారిపల్లి మీదుగా గండి రోడ్డు, మహమ్మదాబాద్- మారాపల్లి, బాలసముద్రం రోడ్డు, కళ్యాణదుర్గం-నాగేపల్లి గేట్ వయా కుందుర్పి, అమరాపురం-వీరుపసముద్రం రోడ్డు, కంబదూరు-పేరూరు రోడ్లు ఉన్నాయి.

రోడ్ల అభివృద్ధి పేరుతో బాదుడు

ఇప్పటి వరకు ప్రభుత్వాలు రోడ్లను నిర్మించి ఎటువంటి టోల్‌గేట్లు లేకుండా వాహనాల రాకపోకలు జరుగుతూ ఉండేవి. ప్రస్తుతం రోడ్లు అభివృద్ధి చేసే పేరుతో ప్రయివేటుకు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. రోడ్లు వేసే ఈ వాహనాలపై అదనపు భారం పడనుంది. ఇప్పటికే జాతీయ రహదారులపై టోల్‌గేట్ల బాదుడు కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని జల్లిపల్లి, వడ్డుపల్లి, బత్తపల్లి, కదిరి, గుత్తి, మరూరు, బాగేపల్లి టోల్‌గేట్లు జాతీయ రహదారులపై ఉన్నాయి. వాహన సామర్థ్యాన్ని బట్టి రూ.125 నుంచి రూ.300 వరకు టోల్‌గేట్ ఛార్జీలను ఇప్పటికే వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా ఇక అదనంగా కొత్తవి వస్తే రవాణాపై భారం పడనుంది. ప్రధానంగా రైతులపై ఈ భారం అధికంగా ఉండనుంది. పంట ఉత్పత్తులను అమ్మకాలకు నాలుగు చక్రాల వాహనాల్లోనే తీసుకెళ్లాలి. ఇలాంటి సమయంలో రైతులకు టోల్ ఛార్జీలు అదనపు భారం కానుంది. ఇక ఆర్టీసీ బస్సు ప్రయాణికులపైనా ఈ భారం పడుతుంది. టోల్ ఛార్జీల భారాన్ని ప్రయాణికుడి ఛార్జీలోనే కలిసి వేస్తారు. దీని వల్ల ఆ భారాన్ని ప్రయాణికుడు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక కారు, ఇతర నాలుగు చక్రాలకు మించి ఉన్న వాహనదారులు అందరికీ ఈ భారం తప్పదు.

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

- ◆ 30న నేమకల్‌లో పింఛన్ల పంపిణీ
- ◆ ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్, కలెక్టర్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

హెలిప్యాడ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాల్ మండలం నేమకల్ గ్రామంలో ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారు అయినట్లు కలెక్టర్ డా।।వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో కలిసి ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. హెలీప్యాడ్ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి స్వయంగా గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. నేమకల్ ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఈశ్వరుని మాన్యం పొలంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో అన్ని పనులనూ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, తహశీల్దార్ మునివేలు, ఎంపీడీవో దాస్‌నాయక్, ఈవోఆర్డీ దేవదాస్, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

హిందూపురం మున్సిపల్ కార్యాలయం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న న్యాయవాదులు

కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటు చేయిస్తాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో ఎడజె కోర్టు ఏర్పాటు చేయిస్తానని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ న్యాయవాదులకు స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో న్యాయవాదులు ఎమ్మెల్యేని కలిశారు. కదిరి కేంద్రంగా ఏడిజే కోర్టు ఆవశ్యకతను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. న్యాయవాదులు కోహినూర్ రవూఫ్, కృష్ణమూర్తి, పి .శ్రీనివాసులు అంబటి శివప్రసాద్, రెడ్డప్ప, హనుమంతు తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఇన్నేళ్ళుగా కదిరిలో ఏడిజె కోర్టు అంశంపై న్యాయవాదులు ఆందోళనలు విజ్ఞప్తులు చేస్తున్నా చలనం లేకుండా పోయిందన్నారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ఆనందంగా ఉందన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కల్లూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో నరసింహమూర్తి బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా సచివాలయంలోని రికార్డులు, ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు రుణప్రోత్సాహం

కలెక్టర్ టిఎస్.చేతన్

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పరిశ్రమల స్థాపనకు పిఎంఈ జిపి పథకం కింద విరివిగా రుణాలు అందించి యువతను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులు, బ్యాంకర్లను కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా పరిశ్రమల ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, పరిశ్రమల జిల్లా అధికారి సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇదివరకే పరిశ్రమల స్థాపనకు కేటాయించిన ప్లాట్‌లలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను తయారు చేయాలన్నారు. సంబంధిత విభాగాల నుంచి 3994 దరఖాస్తులు రాగా 3883 ఆమోదించబడ్డాయని మిగతావి తిరస్కరించినట్లు సంబంధిత అధికారి కలెక్టర్‌కు వివరించారు. పెండింగ్‌లో ఉన్నవి 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఎంపికైన 16 యూనిట్లకు వడ్డీ రాయితీ, పెట్టుబడి రాయితీ, జీఎస్టీ, పవర్ రాయితీలు ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం టిఎంఈజీపీ కింద నిరుద్యోగులకు రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం రమణకుమార్, డిపిఒ సమత, కమిషనర్ ప్రహ్లాద, నైపుణ్య అభివద్ధి శాఖ అధికారి రాజేష్, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7న పేరెంట్స్, టీచర్ల సమావేశం

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా 7న చేపట్టే పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7న జరిగే సమావేశంపై ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఆ కార్యక్రమం పండుగ వాతావరణం తలపించే విధంగా నిర్వహించాలన్నారు. గురువారం నుంచి డిసెంబర్ 7 వరకు రోజు వారి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డ్రాయింగ్, క్విజ్, వకత్వ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌వో మంజువాణి, డీఈవో క్రిష్టప్ప, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, ఎస్టీ సంక్షేమ అధికారి మోహన్ రావు పాల్గొన్నారు.

చైర్మన్ ఎంపిక సరే.. కౌన్సిల్ మీట్ ఎప్పుడు..?

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాలిటీకి ఇన్‌ఛార్జి ఛైర్మన్‌ను నియమించారని.. ఇక కౌన్సిల్ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం హిందూపురం పురపాలక సంఘంలో వైసిపి మద్దతుతో గెలిచిన ఛైర్ పర్సన్ ఇంద్రజ తన పదవికి ఆగస్టు నెలలో రాజీనామా చేశారు. దీంతో అప్పటి నుంచి పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. దీంతో పురపాలికలో ఎక్కడి అభివృద్ధి అక్కడే నిలిచి పోయింది. ఈనేపథ్యంలో అధికారులు వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డిని ఇన్‌ఛార్జి ఛైర్మన్ గా ఎంపిక చేస్తూ పక్షం రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఛైర్మన్ ఎంపిక జరిగి 15 రోజులు అవుతున్నప్పటికీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించడానికి అధికారులు చొరవ చూపకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెలలో సమావేశం జరగక పోతే కౌన్సిల్‌ను రద్దు చేసే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంది. అయితే పురపాలక సంఘంలో వైసిపి మద్దతుతో ఉన్న ఛైర్మన్ ఉండడంవల్ల, నిబంధనను అడ్డుపెట్టుకుని కౌన్సిల్‌ను రద్దు చేసే ప్రయత్నాలు ఏమైనా జరుగుతున్నాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో పాటు వైసిపి మద్దతుతో గెలిచిన కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. ప్రస్తుతం వైసిపి ఛైర్మన్ ఉండడంవల్ల తాము సమావేశానికి హాజరు కాలేకపోతున్నామని, స్థానిక టిడిపి ఇన్‌చార్జుల ముందు మొర పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఆగిన అభివృద్ధి పనులు

హిందూపురం పురపాలక సంఘానికి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక పేరు ఉంది. ఇలాంటి పురపాలక సంఘంలో గత మూడు నెలలుగా కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అధికారులకు అత్యవసరం కింద రూ. 99 వేల వరకు మాత్రమే ఖర్చు చేయడానికి అధికారం ఉంది. దాని కన్నా ఎక్కువ ఖర్చు చేయాలంటే తప్పని సరిగా కౌన్సిల్ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. కనీసం ఛైర్మన్ ఉంటే ముందస్తు అనుమతులు తీసుకుని నిధులు ఖర్చు చేసి, కౌన్సిల్ ఆమోదం అనంతరం నిధులు మంజూరు చేయడానికి అవకాశాలు ఉన్నాయి. మూడు నెలల పాటు ఛైర్మన్ లేకపోవడం, ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఎంపిక జరిగి 15 రోజులు పూర్తి అవుతున్నప్పటికీ అధికారులు సమావేశం నిర్వహించడానికి ముందుకు రాకపోవడంతో పురపాలికలో కనీస అభివృద్ధి కనుచూపు మేర కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించే విధంగా చర్యలు తీసుకుని, పట్టణ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పురప్రజలు కోరుతున్నారు.

సొంతింటి కల సాకారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి అర్బన్

నియోజకవర్గ పరిధిలోని ప్రతి పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చడమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెల్లడించారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ గృహకల్పన, డిట్కో ఇల్లు, పేదలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న గృహ నిర్మాణాల పూర్తి చేయడానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలలో బోర్లు వేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పేదల కోసం పనిచేసే ప్రభుత్వమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సొమ్ము పేదల సొమ్ము స్వాహా చేయాలని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేయొద్దు : స్టాంప్ రైటర్లు ప్రభుత్వం పై అసత్య ప్రచారాలు మానుకోవాలని శాసనసభ్యులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాంపు లీడర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథరైజేషన్, అన్ అప్రూవ్డ్ లేని లేఅవుట్లు రిజిస్ట్రేషన్ చేయకూడదన్నారు. ప్రభుత్వ భూములు, కబ్జాలకు గురైన భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిందన్నారు. సక్రమంగా ఉన్న పేదల భూములు రిజిస్టర్లు ఎందుకు చేయరని అధికారులకు ప్రశ్నించారు. స్టాంప్ రైటర్లు తమ వృత్తిని న్యాయబద్ధంగా కొనసాగించుకొని పేదలకు మంచి సేవలు అందించాలని ఆయన కోరారు. కొంతమంది రాజకీయ ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసి ప్రజలకు మభ్యపెట్టి వారికి లేనిపోని సమస్యలు తెచ్చిపెడుతున్నారని ఈ విషయాన్ని కూడా స్టాంప్ రైటర్లు గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. అధికారికంగా ఎలాంటి ప్లాట్లు వేసినా తమకు అభ్యంతరం లేదన్నారు. ఈ సమావేశంలో సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, తహశీల్దార్ మురళీకృష్ణ, స్టాంప్ రైటర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

సత్యసాయి ఆసుపత్రి వద్ద మద్యం దుకాణం వద్దు

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి -పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపాన మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయొద్దని స్థానిక ప్రజలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇక్కడ దుకాణాన్ని ఏర్పాటు చేస్తే సత్యసాయి బాబా భక్తులు, పర్యాటకులు అసౌకర్యానికి గురవుతారని తెలిపారు. దీనివల్ల ప్రశాంతి నిలయానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. అంతే కాకుండా మద్యం సేవించే వారితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గతంలో ప్రశాంతి నిలయానికి 10 కిలోమీటర్ల దూరంలో మద్యం దుకాణాలు, మాంసం దుకాణాలు, సినిమా థియేటర్లు ఉండాలని సత్య సాయి సెంట్రల్ ట్రస్టు వర్గాలు అప్పటి ప్రభుత్వానికి విన్నవించారన్నారు. అందుకు స్పందించిన ప్రభుత్వం ఈ విన్నపానికి అనుగుణంగానే నిబంధనలను విధించిందన్నారు. కానీ ఇప్పుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ప్రధాన రహదారి కూత వేటు దూరంలోనే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతుండడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం దుకాణాలను 10 కిలోమీటర్ల దూరంలోనే ఏర్పాటు చేయించాలని కోరారు. లేనిపక్షంలో ధర్నాలు, రాస్తారోకోలు, ఆమరణ నిరాహార దీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కేశవయ్య, రవి నాయక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంట సాగుపై అవగాహన

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండల పరిధిలోని ఏలుకుంట్ల గ్రామంలో రైతు వెంకటరమణ సాగు చేసిన మామిడి తోటలను జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, డివిజన్ ఉద్యాన అధికారిణి అమరేశ్వరి బుధవారం సందర్శించారు. పంటసాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ గీతాంజలి, దర్శనమల ఎంపీఈవో రాజేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగా సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రముఖ చిన్న పిల్లలు వైద్యులు డాక్టర్ మదన్ కుమార్ అందించిన సేవలకు గుర్తుగా ఎమ్మెల్యే కందికుంట చేతుల మీదుగా ఆయనను సన్మానించారు. బుధవారం కదిరి బ్లూ మూన్ కాలేజ్ ఆడిటోరియం నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు, సామాజికవేత్త డాక్టర్ మదన్ కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ఆర్డీవో శర్మ , జిల్లా యువజన శాఖ అధికారి కె .మణికంఠ, నెహ్రూ యువ కేంద్ర కార్యక్రమ అధికారి జి. శ్రీనివాసులు, బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాతి భరత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థిని

ధర్మవరం రూరల్ : జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ధర్మవరం విద్యార్థిని ఎంపికైందని బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. నవంబర్ 29 తేదీ నుండి డిసెంబర్ 5 తేదీ వరకు కలకత్తా నగరంలో జరిగే 39వ యూత్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు ధర్మవరం పట్టణానికి చెందిన కిరణ్మయి ఎంపికయ్యారని ధర్మాంభ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయ చంద్రా రెడ్డి తెలిపారు. ఆమె ఎంపిక పట్ల అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామి రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రా రెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, కోచ్ సంజయ్ హర్షం వ్యక్తం చేశారు.

పిహెచ్‌సి తనిఖీ

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిపి ఆదినారాయణ యాదవ్ బుధవారం తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్యసేవల గురించి రోగులతో ఆరా తీశారు. ఆసుపత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ్, పొడరాళ్లపల్లి సర్పంచి నాగభూషణ, కృష్ణమూర్తి యాదవ్, రాము, అమీర్, చంద్ర, అంజన్ రెడ్డి, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని నెలకొన్న సమస్యల పరిష్కారానికి అయా శాఖల అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపిపి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన ఎంపిటిసిలు, సర్పంచులు తమ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంత చారి తదితరులతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసులు, హెచ్‌ఎం సిద్ధారెడ్డి, విశ్వనాథ రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

గుడిబండ : మండల పరిధిలోని సిసిగిరి, భైరేపల్లి గ్రామాల్లోని చెరువుల్లో చేపల పెంపకానికి వేలం పాటను బుధవారం నిర్వహించారు. విస్తరణ అధికారి నాగరాజు నాయక్, సర్పంచి యంజేరగౌడ్, పంచాయతీ కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో ఈ వేలంపాట నిర్వహించారు. భైరేపల్లి చెరువును భైరేపల్లి గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప అనే వ్యక్తి రూ. 90వేలకు సిసి గిరి గ్రామ చెరువును అదే గ్రామానికి చెందిన యంజేరగౌడ్ 41 వేల రూపాయలకు దక్కించుకున్నారని విస్తరణ అధికారి నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

సోమందేపల్లి : మండల పరిధిలోని నాగినేయిని చెరువు గ్రామానికి చెందిన డివి. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో ఆయనను ఎపిటిఎఫ్ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల నాయకులు చంద్ర, సంజీవ రాయుడు, జవ్వాజి నాగరాజు, ఉపాధ్యాయులు దస్తగిరి, సుబ్రహ్మణ్యం, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలో బుధవారం టిడిపి సభ్యత్వాన్ని చేపట్టారు. బూత్ కమిటీ కన్వీనర్ శిరీష ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దేశాయి వెంకటరమణారెడ్డి కుటుంబసభ్యులకు సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. ఈకార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి మహబూబ్ బాషా, వార్డు మెంబర్ తీరుపల్లి దామోదర్, ఉపాధ్యక్షులు చిన్నకుళ్లాయప్ప పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని కందకుర్లపల్లిలో మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు కార్డులు చూపుతున్న దృశ్యం

యువతతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

యువతతోనే అభివృద్ధి సాధ్యమని యువతీ యువకులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటేనే సమాజానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. బుధవారం కదిరి రూరల్ పరిధి ఎర్రదొడ్డి గంగమ్మ మోరి వద్ద ఉన్న బ్లూ మూన్ కళాశాలలో యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ఆర్డీవో శర్మ , జిల్లా యువకేంద్రం అధికారి కె .మణికంఠ , నెహ్రూ యువ కేంద్ర కార్యక్రమ అధికారి జి. శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాతి భరత్, బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్ డాక్టర్. మదన్‌కుమార్ పాల్గొన్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉంటుందన్నారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువత నడుచుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో కదిరిలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌ను నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇందులో భాగంగా యువతకు సైన్స్ మేళా గ్రూప్ మరియు ఇండివిజువల్, మరియు యంగ్ రైటర్స్ కాంటెస్ట్ , యంగ్ ఆర్టిస్ట్ కాంటెస్ట్ ఫోటోగ్రఫీ కాంటెస్ట్ మరియు వర్క్ షాప్ ,డిక్లమేషన్, కాంటెస్ట్, మరియు జిల్లా గ్రూప్ కల్చరల్ ఫెస్టివల్ నిర్వించారు . వివిధ పోటీలలో గెలుపొందిన యువతకు నగదు బహుమతి, కేంద్ర ప్రభుత్వం ప్రశంసా పత్రం అందించారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ గరుగు బాలాజీ , ప్రిన్సిపల్ మనోహర్ రెడ్డి ఆన్‌సెట్ మేనేజర్ సునీల్ కుమార్ రెడ్డి , ఆఫీసు సిబ్బంది రూబీ ఖాన్, సాయి నాథ్, జాతీయ యువ కార్యకర్తలు వాసుదేవ్ , వెంకటేష్, బ్లూమూన్ కాళాశాల సిబ్బంది, యువతీ యువకులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి-హిందూపురం

అధికారులకు ఆదేశాలిస్తున్న మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్

పట్టణంలో పారిశుధ్య నిర్వహణలో అవలంభిస్తున్న నిర్లక్ష్యంపై ఇన్‌ఛార్జి ఛైర్మన్ బలరామిరెడ్డి శానిటరీ ఇన్స్‌పెక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో పర్యటించారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు పెరడంతో పాటు అపరి శుభ్రత ఉండటాన్ని గమనించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రీలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. అక్కడే పైపు లీకేజీ అయి నీరు వృథాగా పోతుండటాన్ని చూసిన ఆయన వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాల ఘటనలో మాజీ ఎమ్మెల్యేపై కేసు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

నకిలీ పట్టాల ఘటనలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాపై కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సోమ్లా నాయక్ అనే తమపై దౌర్జన్యం చేసి తమ పట్టా ఇవ్వడానికి భారీ ఎత్తున నగదు డిమాండ్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఈనెల 22వ తేదీన సున్నపు గుట్ట తండాకు చెందిన పీరే నాయక్ ఫిర్యాదు చేసినట్లు సిఐ చెప్పారు. పీరే నాయక్ ఫిర్యాదు మేరకు సోమ్లా నాయక్ పై కేసు నమోదు చేసి విచారించామన్నారు. విచారణలో భాగంగా 470 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో కదిరి తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ మున్వర్‌బాష మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా ప్రోద్భలంతో నకిలీ పట్టాలను తయారు చేసి ఒక్కొక్కటి లక్ష రూపాయలకు విక్రయించినట్లు సోమ్లా నాయక్ తెలిపారన్నారు. ప్రభుత్వ పట్టాలపై జరిగిన అక్రమాలలో మాజీ ఎమ్మెల్యే అత్త చాంద్ బాషా పై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని సిఐ వివరించారు. నకిలీ పట్టాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. నకిలీ పట్టాలను తయారు చేసి లక్షలు సంపాదించిన ఆర్ఐ మున్వర్‌బాషా పరారీలో ఉన్నట్లు సిఐ చెప్పారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించండి

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని గుడంపల్లి తండా దగ్గర నిర్మిస్తున్న జిల్లేడు బండ సాగు తాగునీటి ప్రాజెక్టును పున: పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని వైసిపి నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాల నాయకులు ప్రాజెక్టు నిర్మాణ కోసం ప్రయత్నించి వదిలేశారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం ప్రజలకు సాగు తాగునీరు అందించే సంకల్పంతో ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు. దాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ఎంతో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ప్రాజెక్టుపై నిరుత్సాహపరిచి రైతులకు అందవలసిన పరిహారం ఇవ్వకుండా తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, సర్పంచి లక్ష్మీదేవి చెన్నరాయుడు, బధనాంపల్లి సర్పంచి వెంగల్ రెడ్డి, పరంధామ రెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తపాలాసేవలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

తపాలా శాఖలో అమలవుతున్న పథకాలు, సేవలపై సిబ్బంది గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కర్నూలు రీజినల్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని పోస్టాఫీసును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న ఐపిపిబి అకౌంట్ల ఓపెనింగ్ గురించి వివరించారు. ఇప్పటికే బత్తలపల్లి పోస్టాఫీసు పరిధిలో దాదాపు 800 పైగా ఐపిపిబి అకౌంట్లు ఓపెన్ చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఇంకా పోస్టల్ ఖాతాదారులు చాలా మంది ఆధార్ సీడింగ్ చేయించుకోనివారున్నారని వారందరూ ఈ అవకాశాన్నిఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కమ్మన్న, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉనికికోసమే మంత్రిపై విమర్శలు : టిడిపి

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపికి చెందిన మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ కేవలం తన ఉనికి కోసమే మంత్రి సవితపై విమర్శలకు దిగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మంత్రి సవిత పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మంత్రి భర్త వెంకటేశ్వరరావు మద్యం దుకాణం ప్రారంభానికి వెళ్తే తప్పేముందని ప్రశ్నించారు. పెనుకొండ అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఉషశ్రీ చరణ్ గతంలో మంత్రిగా ఉండి చేసింది ఏమీలేదని అన్నారు. కళ్యాణదుర్గం ప్రజలు ఛీత్కరిస్తే ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశారని నియోజకవర్గ ప్రజలు ఎన్నికల్లో ఈమెకు సరైన బుద్ధి చెప్పారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీరాములు, సిద్దయ్య, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మునిమడుగు వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

8న జాతీయ ఉపకార వేతనానికి అర్హత పరీక్ష

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

2024-25విద్యాసంవత్సరానికి జరగనున్న జాతీయ ఉపకార వేతన పరీక్ష ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను డిసెంబర్ 8న నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 8న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ఈ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్‌లోని స్కూల్ లాగిన్ లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని డిఇఒ కోరారు.

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్ : సొంత స్థలం ఉన్న వారు ఇంటినిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ధర్మవరం మండలం,రేగాటిపల్లి గ్రామంలో హౌసింగ్ ఎఇ భార్గవి, సచివాలయ సిబ్బందితో కలసి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా చిలకం మాట్లాడుతూ స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు ప్రభుత్వం ఇల్లు నిర్మిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద 1.5 లక్షల రూపాయలు, స్టేట్ షేర్ క్రింద 1 లక్ష రూపాయలు అలాగే జాబ్ కార్డ్ ఉంటే అదనంగా 30 వేల రూపాయలు మొత్తం కలిపి 2 లక్షల 80 వేల రూపాయలు మంజూరు అవుతుందన్నారు. అర్హులు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జయరామి రెడ్డి, ముచ్చురామి సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, టిడిపి నాయకులు ముచ్చిరాం కిష్టా తదితరులు పాల్గొన్నారు.

ఆడ,మగ సమానమే

ప్రజాశక్తి - రొద్దం

సమాజంలో ఆడ మగ ఇద్దరినీ సమానంగా చూడాలని వెలుగు ఏపీఎం విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని ఆర్. మరవపల్లి వెలుగు కార్యాలయం ముందు బుధవారం ఆనిమేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం చేపట్టాలని సూచించారు. అనంతరం వెలుగు సిబ్బంది ఆనిమేటర్లు కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి పెనుగొండ పావుగడ ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు పలు రకాల సమానత్వ భావాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సీసీలు బాబాయ్, బాలరాజు, నరసింహమూర్తి, శాంతి, శ్రీదేవి, ఆనిమేటర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహించొద్దు



మత పెద్దలతో సమీక్షిస్తున్న ఏడీజే కంపల్లె శైలజ

మడకశిరలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీలు, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

మత పెద్దలు బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. బుధవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో బాల్య వివాహాల నిర్మూలనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ చట్ట ప్రకారం బాల్యవివాహాలు నిర్వహించడం నేరమన్నారు. యువకుడికి 21సంవత్సరాలు, యువతికి 18 సంవత్సరాలు ఉంటేనే వివాహం చేయాలన్నారు. ఒకవేళ ఎవరైనా బాల్యవివాహాలు చేయాలని ఒత్తిళ్లు చేస్తే వారి వివరాలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆమె తెలిపారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలలో వివాహాలు చేసే సమయంలో తప్పనిసరిగా వయసు ధ్రువీకరణ చేసుకోవడంతో పాటు భౌతికంగా కూడా మత పెద్దలు విచారణ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వయసులోనే వివాహాలను చేయడం వల్ల సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ఎస్ఐ శ్రీధర్, మత పెద్దలు విద్యాసాగర్, చారు కీర్తి, గోవింద శర్మ, నూరుల్లా, అబ్దుల్ రవూఫ్, సిరాజ్, డేవిడ్, ఏసురత్నం, సుధాకర్, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ : పట్టణంలోని ముక్కడిపేటలో ఉన్న రినాల్ట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు బుధవారం ఆ ప్రాంతంలో బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ముస్తఫా అలీ ఖాన్, హెచ్‌ఎం బీబీజాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర : మండల పరిధిలోని గౌడనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్యవివాహాల నిరోధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేంద్ర, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు సరోజమ్మ, సిద్దమ్మ మాళమ్మ ,ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : బాల్య వివాహాల వలన ఎన్నో అనర్థాలు జరుగుతాయని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి వరలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని జగరాసుపల్లి ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పిడితోపాటు పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, సమత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆదినారాయణ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పీడీ వరలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు నివారించడానికి స్వచ్ఛంద సంస్థలు అంగన్వాడీ కార్యకర్తలు గ్రామ మహిళా పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. అయినా వారి కళ్లుగప్పి ఎంతోమంది వాటిని ప్రోత్సహిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. బార్ కౌన్సిల్ అధ్యక్షులు గంగిరెడ్డి బాల్య వివాహ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో లాయర్లు జయభారతి, సతీష్ రెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గురునాథ్, ఎపిఎం లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలోని గోరంట్ల, సోమందేపల్లి, కదిరి ప్రాంతాలలో చోరీలకు పాల్పడ్డ ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.7 .68 లక్షల నగదు, 84 గ్రాముల బంగారు ఆభరణాలు,2.173 కేజీల వెండి, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు.

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు.పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్, ఎస్ఐ లింగన్న, సిఐ శివ అంజినేయులు, ఎస్ఐ రామచంద్ర ఆధ్వర్యములో అనంతపురం టౌన్ కు చెందిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు వివరించారు. నిందతులు షికారు కోటయ్య, షికారు శ్యాం, షికారు అర్జున్‌ను చెడు వ్యసనాలకు బానిసలై అనంతపురం, శ్రీ సత్య సాయి, అన్నమయ్య , కడప జిల్లాలలో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లారన్నారు. జైలు నుంచి విడుదల అయిన వారు ఒక ముఠాగా ఏర్పడి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని పుట్టపర్తి రూరల్, సోమందేపల్లి , గోరంట్ల మరియు కదిరి పోలీసు స్టేషన్ల పరిధిలో బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ చేశారన్నారు. వీరిపై వివిధ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయన్నారు. వీరిని అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన పుట్టపర్తి డి.ఎస్.పి విజయ్ కుమార్ , ఎస్బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్ , ఎస్ఐ లింగన్నను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి , పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ లింగన్న, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రానికి చెందిన యువకుడు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన సాయి ప్రసాద్ పాలసముద్రంలో గల కియా అనుబంధం ఫ్యాక్టరీలో పనిచేస్తుండేవాడు. ఫ్యాక్టరీలో పనిచేయడానికి ఇబ్బందిగా ఉందని కుటుంబసభ్యులతో తరచూ వాపోయేవాడు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా పనికి కూడా పోలేదు. మంగళవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రొద్దంలో మరో యువకుడు...

ప్రజాశక్తి - రొద్దం

ద్విచక్రవాహనం కొనివ్వలేదన్న కారణంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాచూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శబరి(22) తనకు ద్విచక్ర వాహనం కొనివ్వాలని కొన్ని రోజులుగా తల్లిదండ్రులను కోరుతున్నాడు. అయితే అందుకు వారు నిరాకరించారు. దీంతో మనస్థాపానికి గురైన శబరి బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని పెనుకొండ -పెడపల్లి ప్రధాన రహదారిలో నిడిమామిడి మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన కుల్లాయప్ప, నిడిమామిడి గ్రామానికి చెందిన వెంకటాద్రి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుళ్లాయప్ప మృతిచెందాడు. కుళ్లాయప్ప కియా అనుబంధ సంస్థలో పనిచేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్నాటక మద్యాన్ని క్రయ విక్రయాలు జరిపితే వారిపై పిడి యాక్టు నమోదు చేస్తామని ఎక్సైజ్ సిఐ లక్ష్మి దుర్గయ్య హెచ్చరించారు. బుధవారం పట్టణ పరిధిలోని కొల్లకుంట ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సుమారు 13 బాక్సుల కర్నాటక మద్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. కొల్లకుంటలో కర్నాటక మద్యాన్ని అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారంతో కొట్నూరు, చౌళూరు గ్రామ రెవిన్యూ అధికారులు నరేష్, రవి తేజాలతో కలిసి ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న కర్నాటక మద్యం వ్యాపారి వడ్డే మంజూనాథ్, ఆయన భార్య జయమ్మ వారి ఇంటికి తాళం వేసుకుని వెళ్లి పోయారు. దీంతో గ్రామ పెద్దలతో కలిసి పోలీసులు, అధికారులు ఇంటిని పరిశీలించారు. ఇంటిలో 13 బాక్సుల కర్నాటక మద్యం ఉన్నట్లు గమనించారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్ ఆంజనేయులు, సుధాకరెడ్డి, శివ కుమార్, రవీంద్ర, కుమార్, రంగదామా, ఉష్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : కర్నాటక మద్యం పాకెట్లు తీసుకువెళ్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 20 మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ చంద్రమణి తెలిపారు. బుధవారం మండలంలోని డి. చెర్లోపల్లి క్రాస్ వద్ద పత్యాపురం గ్రామానికి చెందిన బాలకృష్ణ వద్ద 20 కర్నాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల పరిధిలోని ఎన్ఎస్‌పి కొట్టాల సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓవర్ లోడ్‌తో అతివేగంగా వెళుతున్న వాహనాలను ఆపి ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రజా సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు ప్రజా హక్కుల పైన వివరించారు. ఈకార్యక్రమంలో సిఐ శ్యామ రావు, పోలీసులు పాల్గొన్నారు

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

వన్యప్రాణిని వేటాడిన కేసులో తలుపుల మండలం కుర్లి అటవీ చెక్ పోస్ట్ వద్ద నిందితుడిని అరెస్టు చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.అటవీ క్షేత్ర అధికారి రామచంద్ర రెడ్డి తెలిపిన వివరాల మేరకు నంబుల పులకుంట మండలం వెలిచేలమలకి చెందిన బాబా ఫక్రుదీన్ అడవిలో వేటాడిన అలువను తీసుకొస్తుండగా కుర్లీ అటవీ సెక్షన్ చెక్పోస్ట్ వద్ద పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుండి అలువను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చామన్నారు. కోర్టు నిందితుడికి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని పలు హోటళ్లను ఆహారభద్రతా శాఖ అధికారి తస్లీమ భాను బుధవారం తనిఖీ చేశారు. పట్టణంలోని పావగడ రోడ్డులో గల పద్మశ్రీ హోటల్లో వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు లేదని ప్రిన్స్ చాయ్ దుకాణానికి నోటీసులు అందించారు. 14 రోజులలోపు పద్మశ్రీ హోటల్లోని కిచెన్ రూమ్‌ను మార్పు చేయాలని ఆదేశించారు. నాణ్యతతో ఆహార పదార్థాలను తయారు చేయాలని చెప్పారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ప్రజాశక్తి ముదిగుబ్బ

పాఠశాలకు వెళతానని చెప్పి పారిపోయిన ధర్మవరం మండలం నేలకోట గ్రామానికి చెందిన ఎనిమిదోతరగతి విద్యార్థిని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. గ్రామానికి చెందిన చరణ్ నాయక్ ధర్మవరం బిఎస్ఆర్ స్కూల్ నందు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తనకి చదువుకోవడం ఇష్టం లేక బుధవారం ఉదయం స్కూలుకు వెళ్తానని చెప్పి, ఎక్కడికైనా వెళ్లిపోవాలని ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. గమనించిన ముదిగుబ్బ పోలీసులు బాలున్ని విచారించి, వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి అప్పగించారు.